సాక్షి
నంద్యాల
సోమవారం । 23 । జూన్ । 2025



తడబడే వయస్సు..

ఒక్కసారిగా కళాశాల వాతావరణం.. అన్నీ కొత్తగా, వింతగా అనిపిస్తాయి. తొందరపాటు నిర్ణయాలు తీసుకుంటే జీవితం మళ్లీ మన చేతుల్లోకి రానంత వెనక్కి వెళ్తుంది. 8లో▸



మల్లన్నకు నృత్య నివేదన

శ్రీశైలంటెంపుల్: ఆలయ నిత్యకళావేదికపై ఆదివారం వైఎస్సార్ జిల్లాకు చెందిన ఎస్. నటరాజ డ్యాన్స్ అకాడమీ వారి సంప్రదాయ నృత్యప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,614.07
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 46.236
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 30,594
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 192

న్యూస్‌రీల్

శ్రీశైలంలో భక్తుల రద్దీ



దర్శనానికి బారులు దీరిన భక్తులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో వెలసిన శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనానికి ఆదివారం భక్తులు రద్దీ కొనసాగింది. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు మల్లన్న దర్శనానికి భారీగా తరలివచ్చారు. వేకువజాము నుంచే పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు మల్లికార్జునస్వామివారి దర్శనానికి క్యూలైన్ వద్దకు చేరుకున్నారు. ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలైన్ల ద్వారా భక్తులు స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

నంద్యాల:స్థానిక కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో సోమవారం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ దరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవడం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1100ను సంప్రదించి తెలుసుకోవచ్చన్నారు. అలాగే అర్జీదారులు దరఖాస్తుల ప్రస్తుత సమాచారాన్ని meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో తెలుసుకోవడంతో పాటు తమ అర్జీలను కూడా నమోదు చేసుకోవచ్చన్నారు. అర్జీదారులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.

నేటి పీజీఆర్ఎస్ రద్దు

బొమ్మలసత్రం: జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. కొన్ని అనివార్య కారణాల వల్ల పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేశామని, ఈనెల 30న సోమవారం యథావిధిగా నిర్వహిస్తున్నామన్నారు.

ప్రశాంతంగా డీఎస్సీ పరీక్షలు

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలోని ఐదు పరీక్ష కేంద్రాల్లో ఆదివారం తెలుగు, పీఈటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు డీఈఓ జనార్దన్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ఉదయం జరిగిన పరీక్షకు 790 మందికి గాను 748 మంది అభ్యర్థులు హాజరు కాగా, 42 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. అలాగే మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 742 మందికి గాను 565 మంది అభ్యర్థులు హాజరు కాగా 177 మంది గైర్హాజరైనట్లు తెలిపారు.

ఉత్తమ జీవనానికి సోపానాలు ఇతిహాసాలు

కర్నూలు కల్చరల్: ఉత్తమ జీవనానికి భారత, భాగవత, రామాయణ ఇతిహాసాలు సోపానాలుగా నిలుస్తాయని ఇస్కాన్ ధర్మ ప్రచారకులు గంగావతి హరిదాస్ అన్నారు. ఆదివారం స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని పూరి జగన్నాథ మందిరంలో యోగిని ఏకాదశి వేడుకలు, భగవద్గీత తరగతులు, శీల ప్రభుపాదుల ప్రేమ విందు కార్యక్రమాలు జరిగాయి. జగన్నాథ్, సుభద్ర, బలదేవ్‌లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం వైష్ణోకృప చైతన్య ప్రభు సందేశమిస్తూ భగవద్గీత పఠనం, శ్రవణంతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు.

చేనుకు కూటమి చేటు!

- ఖరీఫ్ మొదలైనా ఊసేలేని భూసార పరీక్షలు
- ఇష్టారాజ్యంగా మట్టి నమూనాల సేకరణ
- విద్యుత్ సరఫరా లేని ఎమ్మిగనూరు పరీక్ష కేంద్రం
- గతేడాది కెమికల్స్ నిధులు స్వాహా

వ్యవసాయంలో పెట్టుబడులు తగ్గి, దిగుబడులు పెరగాలంటే భూసార పరీక్షలు తప్పనిసరి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పరీక్షలు నిర్వహించి ఫలితాలను సకాలంలో రైతులకు ఇవ్వలేకపోతోంది. ఈ ఏడాది ఇప్పటి వరకు మట్టి నమూనాల సేకరణే పూర్తి కాలేదు. భూసార పరీక్షల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయి ఇవ్వలేదు. దీంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నేల స్వభావాన్ని తెలుసుకోకుండా వివిధ పంటలు సాగు చేస్తున్నారు. ఎలాంటి రసాయన ఎరువులు వాడాలో వారికి చెప్పే వారు కరువయ్యారు.





కరెంట్ లేని ఎమ్మిగనూరు భూసార పరీక్ష కేంద్రం



ఎమ్మిగనూరు భూసార పరీక్ష కేంద్రానికి గత ఏడాది వచ్చిన మట్టి నమూనాలు (ఫైల్)

కర్నూలు(అగ్రికల్చర్): రైతులకు భూసార పరీక్ష వివరాలు అందితే సాగు ఖర్చు తగ్గించుకోవడంతో పాటు అధిక దిగుబడులు సాధించుకునే అవకాశం కలుగుతుంది. ఈ ఏడాది ఉమ్మడి కర్నూలు జిల్లాలో 49 వేల భూసార పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. కాని ఇంతవరకు మట్టి నమూనాల సేకరణ, రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయడం మినహా ఇతరత్రా ఎలాంటి పురోగతి లేకుండా పోయింది. అయినా రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదు.

20 రోజులు గడిచినప్పటికీ...

భూసార పరీక్షల్లో ఉదజని సూచిక, స్థూల పోషకాలైన భాస్వరం, నత్రజని, పోటాష్‌తో పాటు సూక్ష్మ పోషకాలైన జింక్, కాల్షియం, క్లోరిన్, ఐరన్, మెగ్నీషియం, మాంగనీస్, సల్ఫర్, కాపర్, మాలిబ్డినం తదితర 15 పరీక్షలు నిర్వహిస్తారు. ఉద్దేశం మంచిదే అయినప్పటికి భూసార పరీక్షల నిర్వహణలో చిత్తశుద్ధి లోపించడం రైతుల పాలిట శాపంగా మారింది. ఉమ్మడి జిల్లాలో 877 రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. ఒక్కో దాని నుంచి 55 మట్టి నమూనాలు సేకరించాల్సి ఉంది. వాటి ఇన్‌చార్జ్‌లు మట్టి నమూనాలు సేకరించి.. వాటి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసిన తర్వాత మట్టి నమూనాలను సంబంధిత భూసార పరీక్ష కేంద్రాలకు తరలిస్తారు. ఖరీఫ్ సీజన్ మొదలై 20 రోజులు గడచినప్పటికీ మట్టి నమూనాల సేకరణనే పూర్తి కాలేదు. భూసార పరీక్షల నిర్వహణకు ప్రభుత్వం ఒక్క రూపాయి విదిల్చలేదు. కెమికల్స్ లేవు.. ఇన్ని సమస్యల మధ్య భూసార పరీక్ష ఫలితాలు ఎప్పుడు ఇస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది.

పరీక్షలకు 'విద్యుత్' షాక్

ఎమ్మిగనూరు భూసార పరీక్ష కేంద్రంలో ఏడీఏ పోస్టుతో పాటు నాలుగు ఏవో పోస్టులు ఉన్నాయి. షార్ట్ సర్క్యూట్ కారణంగా వైరింగ్ మొత్తం కాలిపోయి ఈ కేంద్రానికి నాలుగు నెలల నుంచి కరెంటు లేదు. విద్యుత్ ప్రమాదానికి బిల్డింగ్ కూడా దెబ్బతినింది. భవనానికి పూర్తి స్థాయిలో వైరింగ్ పనులు చేపట్టాల్సి ఉంది. ఇందుకు రూ.4.60 లక్షలతో ప్రతిపాదనలు పంపినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఇంతవరకు పట్టించుకోలేదు. కరెంట్ లేకపోవడంతో భూసార పరీక్షల నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది.

ప్రహసనం

మట్టి నమూనాల సేకరణకు స్పష్టమైన మార్గదర్శకాలు ఉన్నాయి. ఈ ప్రకారమే సేకరించాల్సి ఉంది. గ్యాప్ పొలంబడి నిర్వహించే ప్రాంతాలు, ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలు, ఆయిల్ సీడ్స్ ప్రదర్శనా క్షేత్రాలు..తదితర ప్రాంతాల్లోనే మట్టి నమూనాలు సేకరించాల్సి ఉంది. 2024–25లో మార్గదర్శకాలను పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా సేకరించి మమ అనిపించారు. దీంతో భూసార పరీక్షలకు ఎలాంటి ప్రాధాన్యత లేకుండా పోయింది. ఈ ఏడాది ఆన్‌లైన్‌లోనే మట్టి నమనాలు సేకరించాల్సి ఉంది. ఈ సారి కూడా మట్టి నమూనాల సేకరణ ప్రహసనంగా మారింది. మార్గదర్శకాలకు విరుద్ధంగా మట్టి నమూనాలు సేకరిస్తుండటంతో భూసార పరీక్షల్లో పారదర్శకత లేకుండా పోయింది.

నిధులు స్వాహా

భూసార పరీక్షల్లో నాణ్యత ఉండాలంటే తగిన మోతాదులో రసాయనాలు వినియోగించాల్సి ఉంది. గత ఏడాది భూసార పరీక్షలకు అవసరమైన రసాయనాల కొనుగోలు చేసేందుకు విడుదల చేసిన రూ.15 లక్షలు స్వాహా అయ్యాయి. ఈ ఏడాది ఒక్క రూపాయి విడుదల కాలేదు. రసాయనాలు లేవు. గతంలో 2014 నుంచి 2019 వరకు అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం భూసార పరీక్షలంటూ హంగామా చేసిందే తప్ప.. ఫలితాలను రైతులకు ఇవ్వలేదు. ఇదే పరిస్థితి 2024–25లో కూడా పునరావృతం అయ్యింది. 2025–26లో భూసార పరీక్షల నిర్వహణ మరింత అస్తవ్యస్తం అయిందనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

ఇవీ భూసార పరీక్ష కేంద్రాలు..

- కర్నూలు జిల్లాకు సంబంధించి కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో భూసార పరీక్ష కేంద్రం ఉంది. అలాగే ఎమ్మిగనూరులోని భూసార పరీక్ష కేంద్రాల్లో మట్టి నమూనాలను పరీక్షిస్తారు.
- నంద్యాల జిల్లాకు సంబంధించి నంద్యాలలోని భూసార పరీక్ష కేంద్రం లో పరీక్షలు నిర్వహిస్తారు.

ఇవీ సమస్యలు

- ఎమ్మిగనూరు భూసార పరీక్ష కేంద్రంలో 12,971 మట్టి నమూనాలను పరీక్షించాల్సి ఉంది. రైతుసేవా కేంద్రాల నుంచి ఒక్క మట్టి నమూనా కూడా ఇక్కడికి చేరలేదు. కరెంటు లేకపోవడంతో భూసార పరీక్షల నిర్వహణకు గ్రహణం పట్టింది.
- కర్నూలు మార్కెట్ యార్డులోని సాయిల్ టెస్టింగ్ ల్యాబ్‌లో 12,971 మట్టి నమూనాలను పరీక్షించాల్సి ఉంది. ఈ ల్యాబ్‌కు రైతు సేవా కేంద్రాల నుంచి 1,430 మట్టి నమూనాలు చేరాయి. అయితే శాస్త్రీయంగా పరీక్షించేందుకు కెమికల్స్ లేపోవడంతో ఇంతవరకు భూసార పరీక్షలు చేపట్టిన దాఖలాలు లేవు.
- నంద్యాల జిల్లాకు సంబంధించి ఇంతవరకు భూసార పరీక్షల నిర్వహణ అతీగతీ లేకుండా పోయింది. ఈ జిల్లాలో 411 రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. ప్రతి కేంద్రం నుంచి 55 మట్టి నమూనాలు సేకరించాల్సి ఉంది. ఈ ప్రకారం 22,605 మట్టి నమూనాలు సేకరించి.. ఆన్‌లైన్‌లో నమోదు చేసిన తర్వాత ల్యాబ్‌కు పంపాల్సి ఉంది. ఇంతవరకు నంద్యాల ల్యాబ్‌కు ఒక్క మట్టి నమూనా కూడా రాలేదు.

చర్యలు తీసుకుంటున్నాం



ఈ ఏడాది జిల్లాలో 25 వేలకు పైగా భూసార పరీక్షలు చేపట్టేందుకు వ్యవసాయ శాఖ ఆదేశాలు ఇచ్చింది. ఒక్కో రైతు సేవా కేంద్రం పరిధిలో 55 మట్టి నమూనాలు సేకరించే విధంగా లక్ష్యాలు ఇచ్చాం. ప్రస్తుతం రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఆన్‌లైన్ చేసిన తర్వాత మట్టి నమూనాలు ల్యాబ్‌లకు వస్తాయి. కర్నూలులో సగం, ఎమ్మిగనూరు ల్యాబ్‌ల్లో సగం ప్రకారం మట్టి నమూనాలకు పరీక్షలు నిర్వహిస్తారు. రైతులకు త్వరగా భూసార పరీక్షల ఫలితాలు అందచేయడానికి చర్యలు తీసుకుంటున్నాం.

– పీఎల్ వరలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి, కర్నూలు

నేడు 'యువత పోరు'



వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు సురేష్‌యాదవ్

బొమ్మలసత్రం: నిరుద్యోగులను నిలువునా మోసం చేసిన కూటమి ప్రభుత్వాన్ని నిలదీసేందుకు సోమవారం యువత పోరు కార్యక్రమాన్ని చేపట్టామని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు సురేష్‌యాదవ్ తెలిపారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు కూటమి నేతలు నిరుద్యోగ భృతి రూ. 3 వేలు ఇస్తామని హామీ ఇచ్చారని, అలాగే 20 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని నమ్మించారన్నారు. ప్రభుత్వం ఏర్పాటై నేటికి ఏడాది పూర్తయినా నిరుద్యోగ భృతి ఊసే లేదన్నారు. నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేరవేర్చాలన్న డిమాండ్‌తోనే సోమవారం యువత పోరు నిరసన కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. స్థానిక ఉదయానంద రెసిడెన్సీ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లి వినతి పత్రం అందిస్తున్నామని వివరించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న నిరుద్యోగులు, విద్యార్థి, నిరుద్యోగ యువత భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు.

శ్రీశైలం డ్యాంకు పెరుగుతున్న వరద ఉద్ధృతి



855.20 అడుగులకు చేరుకున్న శ్రీశైలం డ్యాం నీటిమట్టం


శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయానికి రోజురోజుకు వరద ఉద్ధృతి పెరుగుతుంది. జూరాల ప్రాజెక్ట్‌లో స్పిల్‌వే ద్వారా, విద్యుత్ ఉత్పాదన అనంతరం, తుంగభద్ర నీరు సుంకేసుల ద్వారా వేలాది క్యూసెక్కులు విడుదలవుతోంది. అదే విధంగా లోకల్ క్యాచ్‌మెంట్‌లో కురుస్తున్న వర్షాలు కూడా వీటికి తోడు కావడంతో జలాశయం లోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. నీటిమట్టం గణనీయంగా పెరుగుతోంది. శనివారం నుంచి ఆదివారం వరకు ఎగువ పరీవాహక ప్రాంతాల నుంచి 76,178 క్యూసెక్కుల వరదనీరు డ్యామ్‌కు చేరుకున్నాయి. డ్యామ్‌లో నీటినిల్వలు పెంచడం కోసం గత నాలుగు రోజులుగా విద్యుత్ ఉత్పాదనను నిలిపివేయడమే కాకుండా, బ్యాక్ వాటర్ నుంచి దిగువ ప్రాజెక్టులకు నీటి విడుదలను నిలిపేశారు. ఆదివారం సాయంత్రానికి జలాశయంలో 92.4860 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యాం నీటిమట్టం 855.20 అడుగులకు చేరుకుంది.

సంగమేశ్వర శిఖరానికి పూజలు



ఆలయ శిఖరానికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఆలయ పురోహితులు

కొత్తపల్లి: సప్తనది సంగమ ప్రాంతంలో వెలసిన ప్రాచీన సంగమేశ్వరాలయం జాలాధివాసం అవుతున్న తరుణంలో ఆలయ శిఖరానికి ప్రత్యేక పూజలను ఆదివారం చేశారు. ప్రస్తుతం శ్రీశైలం జలాశయం నీటిమట్టం 855 అడుగులకు చేరుకుంది. దీంతో ఆలయ గోపురానికి నీటిమట్టం చేరుకుంది. మరికొద్ది రోజుల్లోనే ఈ ఆలయం పూర్తిగా కృష్ణమ్మ ఒడిలోకి చేరుకుంటుంది. ఆలయపురోహితులు తెలకపల్లి రఘురామ శర్మ మరబోటులో వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. శిఖర భాగంపై కృష్ణాజలాలతో అభిషేకం, క్షీరాభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన, తదితర విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు.



జాలాధివాసం అవుతున్న సంగమేశ్వరాలయం

కౌన్సెలింగ్ ఆలస్యం.. అస్తవ్యస్తం

- ఎంటీఎస్ టీచర్ల మధ్య వాగ్వాదం



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న విద్యాశాఖ అధికారులు



కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఆరుబయట కూర్చున్న ఎంటీఎస్ ఉపాధ్యాయులు

కర్నూలు సిటీ: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న మినిమం టైం స్కేల్ (ఎంటీఎస్) టీచర్లకు ఇటీవలే కూటమి ప్రభుత్వం రెన్యూవల్ చేసింది. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు పూర్తి కావడంతో మిగిలిన ఖాళీల్లో 1998 డీఎస్సీ, 2008 డీఎస్సీలకు చెందిన మినిమం టైం స్కేల్ టీచర్లను నియమించేందుకు విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఆదివారం ఉమ్మడి జిల్లాలోని ఎంటీఎస్ టీచర్లకు స్థానాలు కేటాయించేందుకు కర్నూలు సమగ్ర శిక్ష కార్యాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు కాకుండా ఆలస్యంగా కౌన్సెలింగ్ నిర్వహించారు. అయితే 1998 డీఎస్సీ ఎంటీఎస్ టీచర్లు, 2008 డీఎస్సీ ఎంటీఎస్ టీచర్ల మధ్య సీనియారిటీ విషయంలో వాగ్వాదం జరిగింది. విద్యాశాఖ అధికారులు ఇచ్చిన ఆదేశాల ప్రకారం కౌన్సెలింగ్ నిర్వహిస్తామని చెప్పినా వివాదం సమసిపోలేదు. దీంతో విద్యాశాఖ అధికారులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు కౌన్సెలింగ్ కేంద్రం దగ్గరకు వచ్చి అధికారులు పిలిచిన వారిని మాత్రమే హాల్‌లో అనుమతించారు. మిగిలిన వారిని బయటకు పంపించారు. ఆ తరువాత కౌన్సెలింగ్ మొదలైంది. ముందుగా ఉర్దూ, కన్నడ మీడియం టీచర్లకు స్కూళ్లను కేటాయించారు. కౌన్సెలింగ్ ఆలస్యం కావడం..వర్షం రావడంతో ఎంటీఎస్ టీచర్లు ఇబ్బందులు పడ్డారు.

ఉమ్మడి జిల్లాలో 3,296 ఖాళీలను చూపిన విద్యాశాఖ

ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పూర్తి కావడంతో ఇక మిగిలిన ఖాళీలలో ఎంటీఎస్ టీచర్లను నియమించేందుకు విద్యాశాఖ ఉమ్మడి జిల్లాలో 3296 టీచర్ పోస్టుల ఖాళీలను చూపించారు. అయితే ఇందులో పశ్చిమ ప్రాంతంలోని స్కూళ్లలోనే అధిక శాతం ఖాళీలు ఉన్నాయి. 1998, 2008 డీఎస్సీలకు చెందిన ఎంటీఎస్ టీచర్లు ఉమ్మడి జిల్లాలో 353 మంది ఉన్నారు. వీరందరికీ జాబితాలో ఉండే సీరియల్ నంబరు ఆధారంగా ఆయా మండలాల్లోని ఖాళీలను చూపించి స్కూళ్లను కేటాయించారు. ఎంటీఎస్ టీచర్లను నియమించినా కూడా ఇంకా జిల్లాలో 2, 943 టీచర్ పోస్టులు ఖాళీగా ఉండనున్నాయి. ఇందులో 2024 డీఎస్సీ ఎస్‌జీటీ తెలుగు మీడియం 1,671, కన్నడ మీడియం 28 పోస్టులు, ఉర్దూ మీడియం పోస్టులు 118 పోయినా 1,126 టీచర్ పోస్టులు జిల్లాలో ఖాళీగా ఉండనున్నాయి.

సీఎంఓ చెప్పింది.. ఉద్యోగం చేపిస్తాం

- సీఎంఓలో విద్యా వ్యవహారాలు చూసే ప్రొఫెసర్ సిఫారసుతో ఒకరికి ఉద్యోగం
- ఎలాంటి ఉద్యోగ ప్రకటన, నియామకం లేకుండానే ఎలక్ట్రీషియన్‌గా విధులు
- కీలకమైన పరీక్షల విభాగంలో ప్రైవేటు కళాశాల ఉద్యోగి

ఆర్‌యూలో అనధికార ఉద్యోగులు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయంలో అనధికారికంగా కొందరు వ్యక్తులు ఉద్యోగులుగా చలామణి అవుతున్నారు. వీరికి వర్సిటీ ఉన్నతాధికారుల అండదండలు పుష్కలంగా ఉన్నట్లు చర్చ జరుగుతోంది. గతంలో రెగ్యులర్ వైస్‌ఛాన్సలర్‌గా విధులు నిర్వహించిన ప్రొఫెసర్ నలుగురికి డైలీ వేజ్ కింద విధులు నిర్వహించేలా ఒక సర్క్యులర్ జారీ చేశారు. దాని ప్రకారం వారు వర్సిటీలో విధులు నిర్వహిస్తున్నారు. తరువాత వచ్చిన వీసీ గతంలో వీసీ జారీ చేసిన సర్క్యులర్‌లో స్పష్టత లేకపోవడంతో వారిని విధులు నిర్వహించొద్దని ఆదేశించారు. దాంతో వారు కొన్ని రోజులు విధులకు హాజరు కాలేదు. ఇంజినీరింగ్ సెక్షన్‌లోని ఓ ఉద్యోగి జోక్యం చేసుకొని వారితో లోపాయికారీ ఒప్పందం చేసుకొని మళ్లీ విధులకు హాజరయ్యేలా వీసీతో మాట్లాడటంతో తిరిగి విధులు నిర్వహిస్తున్నారు. నెలల కొద్దీ విధులు నిర్వహిస్తున్నా వీరికి ఎలాంటి నియామక ప్రకటన, ఉత్తర్వులు లేకపోవడంతో వీరు అనధికారికంగా విధులు నిర్వహిస్తున్నారు.

- సీఎంఓలో విద్యా వ్యవహారాలు చూసే ఓ సీనియర్ ప్రొఫెసర్ సిఫారసుతో ఎలాంటి ప్రకటన లేకుండా, ఉన్నత విద్యా మండలి, ఫైనాన్స్ అనుమతి లేకుండానే ఆర్‌యూ అధికారులు ఒకరికి ఉద్యోగం కల్పించారు. ఇతను తెలంగాణ రాష్ట్రం రాజోలికి చెందిన వ్యక్తిగా వర్సిటీలో చర్చ జరుగుతోంది. ఇతను మూడు నెలలుగా ఎలాంటి నియామక పత్రం లేకుండానే అనధికారికంగా విధులు నిర్వహిస్తున్నారు. ప్రమాదకరమైన ఎలక్ట్రీషియన్ పనులు ఇతనితో చేయిస్తున్నారు. విధులకు హాజరు అవుతున్న సదరు ఉద్యోగి జీతం ఇవ్వాలని వర్సిటీ రిజిస్ట్రార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాడు. ఎవరైనా ఎమైనా అడిగితే సీఎంవో నుంచి ఆదేశాలు ఉన్నాయి.. అవసరం ఉన్నప్పుడు పనిచేయించుకుంటున్నామని వర్సిటీ ఉన్నతాధికారులు చెబుతున్నారని చర్చించుకుంటున్నారు.
- వర్సిటీలో కీలకమైన పరీక్షల విభాగంలో ఆ విభాగం అధికారి తన సొంత నిర్ణయంతో ప్రైవేట్ కళాశాలలో విధులు నిర్వహిస్తున్న ఒక ఉద్యోగితో పనిచేయించుకుంటున్నారని బహిరంగాంగానే చర్చించుకుంటున్నారు. ఇతను కేవలం కళాశాల ప్రిన్సిపాల్‌తో అనుమతి తీసుకొని పరీక్షల విభాగంగా విద్యార్థుల మార్క్స్‌మెమోస్, ప్రొవిజినల్ సర్టిఫికెట్స్ వెరిఫై చేయిస్తున్నట్లు చెబుతున్నారు. వర్సిటీ ఉన్నతాధికారులకు ఈ సమాచారం తెలియదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అతి కీలకమైన కాన్ఫిడెన్సియల్ అయిన పరీక్షల విభాగంలో అనధికారికంగా ఒక వ్యక్తితో పని చేయించుకోవడంపై తీవ్రమైన ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.
- ఇలా వర్సిటీలో అనధికార ఉద్యోగులు కీలకమైన పోస్టుల్లో విధులు నిర్వహిస్తున్నా అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరించడంపై అనేక అనుమానాలు కలుగుతున్నాయి. వర్సిటీలో ఎంత మంది ఉద్యోగులు అధికారికంగా, ఎంత మంది అనధికారికంగా విధులు నిర్వహిస్తున్నారో అనే సరైన సమాచారం వర్సిటీ ఉన్నతాధికారుల వద్ద లేకపోవడం గమనార్హం. అధికారంగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకే వివిధ కారణాలతో సీఎఫ్ఎంఎస్ ద్వారా కాకుండా వర్సిటీ ఇంటర్నల్ ఫండ్స్ నుంచి జీతాలు చెల్లిస్తుండటంతో వర్సిటీ ఖజానా మొత్తం ఖాళీ అవుతుందని, వర్సిటీ అభివృద్ధికి నిధులు సమకూర్చుకోవడం ఇబ్బందికరమేని మేధావులు అభిప్రాయపడుతున్నారు.



విద్యుత్ మరమ్మతులు చేస్తున్న అనధికారిక ఉద్యోగి

జీతాలు చెల్లించడం లేదు

వర్సిటీలో అనధికారికంగా కొందరు విధులు నిర్వహిస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. గతంలో నలుగురు డైలీ వేజ్ కింద వచ్చి విధులు నిర్వహించే వారు. మధ్యలో మానేసి మళ్లీ వస్తున్నారు. వారికి ఎలాంటి జీతం ఇవ్వడం లేదు. ఒక ఎలక్ట్రీషియన్‌ను గతంలో రెండు నెలలు వచ్చి విధులు నిర్వహిస్తున్నట్లు తెలిస్తే రావొద్దమని చెప్పాం. ఒక నెల రాలేదు. ఈ మధ్యలో వస్తున్నట్లు తెలిసింది. జీతం కోసం ఇటీవల నాదగ్గరికి వచ్చాడు. జీతం చెల్లించలేమని చెప్పాం.

– విజయకుమార్ నాయుడు, రిజిస్ట్రార్, ఆర్‌యూ

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



ప్రకాష్‌పాల్ (ఫైల్)

● ఇద్దరికి తీవ్ర గాయాలు

ఆదోని అర్బన్: పట్టణ శివారులోని ఎమ్మిగనూరు రోడ్డు బైపాస్ సమీపంలో శనివారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలు.. పట్టణానికి చెందిన ప్రకాష్‌పాల్, యోగేష్‌పాల్, సురేష్‌పాల్‌లు శనివారం పని నిమిత్తం ఎమ్మిగనూరుకు వెళ్లారు. అక్కడ పని మునిగించుకుని శనివారం అర్ధరాత్రి ఆదోనికి బైకుపై వస్తుండగా పట్టణశివారులోని ఎమ్మిగనూరు బైపాస్ రోడ్డు సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. స్థానికులు వెంటనే ఆదోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆదివారం ప్రకాష్‌పాల్ చికిత్స పొందుతూ మృతిచెందారు. యోగేష్‌పాల్, సురేష్‌పాల్‌కు తీవ్ర గాయాలు కావడంతో వారిని వైద్యులు కర్నూలుకు రెఫర్ చేశారు. యోగేష్ పాల్‌ను బళ్లారికి తరలించగా, సురేష్‌పాల్ పట్టణంలోని ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతుడు ప్రకాష్‌పాల్‌కు భార్య లక్ష్మి, ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పానీపూరి బండి పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.


నల్లమల ఘాట్‌లో తప్పిన పెను ప్రమాదం



ఘాట్‌లో ఢీకొన్న రెండు కార్లు

మహానంది: నంద్యాల–గిద్దలూరు నల్లమల ఘాట్‌రోడ్డులో ఆదివారం పెనుప్రమాదం తప్పింది. ఎదురెదురుగా వస్తున్న రెండు కార్లు చింతమాను టర్నింగ్ సమీపంలో ఢీకొన్నాయి. అయితే, అదృష్టవశాత్తు ఎవరికి ఎలాంటి ప్రమాదం లేకపోవడంతో రెండు కార్లల్లో ఉన్న వారు ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న మహానంది, రోడ్‌సేఫ్టీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదాన్ని పరిశీలించారు. ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదని పోలీసులు తెలిపారు. ప్రయాణికుల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

టిప్పర్ ఢీకొని వ్యక్తి దుర్మరణం



ప్రమాదానికి కారణమైన టిప్పర్

పాణ్యం: మండల కేంద్రమైన పాణ్యంలోని ఫ్లైఓవర్‌పై టిప్పర్ ఢీకొని వడ్డుగండ్ల గ్రామానికి చెందిన వ్యక్తి ఆదివారం దుర్మరణం చెందాడు. ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. వడ్డుగండ్ల గ్రామానికి చెందిన నల్లబోతుల రాంభూపాల్(40) బైక్‌పై పాణ్యంలోని ఎస్సార్బీసీ కాల్వ సమీపంలోని దోజర్ పని విషయం మాట్లాడేందుకు వెళ్తుండగా ఏపీ 05టీఈ2355 నంబర్ గల టిప్పర్ లోడ్‌తో ఎదురై ఢీకొంది. ఈ ఘటనలో నల్లబోతుల రాంభూపాల్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న హైవే పెట్రోల్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి ఇద్దరు భార్యలు, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు సమాచారం. ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



మృతి చెందిన నల్లబోతుల రాంభూపాల్

తడబడే వయస్సు.. పొరబడే మనస్సు!

● ఇంటర్‌లో కౌమార దశ
● గాడితప్పితే జీవితమే గందరగోళం
● చెడు వ్యసనాలకు దూరంగా ఉంటేనే లక్ష్యానికి చేరువ
● క్రమశిక్షణతో సాగితే విజయం ఖాయం

నంద్యాల(న్యూటౌన్): తొలిసారి ఎదుర్కొన్న పదిపబ్లిక్ పరీక్షల్లో విజయం సాధించామన్న ఆత్మవిశ్వాసం, పాఠశాలను దాటి కళాశాలను చేరామన్న ఉత్సాహం.. కొత్త పరిచయాలు, కళాశాల వాతావరణం కల్గించే ఆనందం.. ఇలా అన్నీ వెరసి విద్యార్థులకు ఇంటర్మీడియెట్ దశ ఓ కొత్త బంగారు లోకమే. అనువైన గ్రూపు, ఇష్టమైన సబ్జెక్టులు చదివే తొలి స్వేచ్ఛా దశ ఇదని చెప్పవచ్చు. జీవితంలో కీలక అడుగులన్నీ ఇంటర్‌లోనే పడతాయనడంలో అతిశయోక్తి లేదు. ఉన్నత ప్రమాణాలతో ఉత్తమ ఫలితాలు సాధించినా, గాడి తప్పి అధఃపాతాళానికి పడిపోయినా.. అంతా ఇంటర్‌లోనే బీజాలు పడతాయని చెప్పుకోవచ్చు. హైస్కూల్ విద్యతో మొదలయ్యే కౌమార ప్రాయం ఇంటర్‌లో మరింత పురి విప్పుతుంది. అందుకే జాగ్రత్త పడాలి. సినిమాల ప్రభావంతో, స్నేహితుల ప్రోత్సాహంతో ప్రేమాయణమంటూ

నిన్నటి వరకు పాఠశాల చదువు.. ఒక్కసారిగా కళాశాల వాతావరణం.. ఇంటర్ విద్యార్థులకు ఇదో కొత్త అనుభవం. కొత్త వారితో పరిచయాలు, సరికొత్తగా అనిపించే ఆలోచనలు.. ఇప్పుడిప్పుడే కళాశాలలో అడుగుపెట్టే విద్యార్థికి ఇలా అన్నీ కొత్తగా, వింతగా అనిపిస్తాయి. టీనేజ్‌లో ఇంటర్మీడియెట్ దశ అత్యంత కీలకం. జీవితాన్ని మలుపు తిప్పాలన్నా ఇదే ముఖ్యమైన కాలం. ఏ మాత్రం తొందరపాటు నిర్ణయాలు తీసుకున్నా.. జీవితం మళ్లీ మన చేతుల్లోకి రానంత వెనక్కి వెళ్తుంది. అందుకే ఇప్పుడిప్పుడే జూనియర్ కళాశాలల్లో చేరుతున్న వారు జాగ్రత్తలు పాటిస్తూ ముందుకు సాగితే ఇంటర్ దశ కొత్త బంగారులోకమై భవిష్యత్ ఉజ్వలమయమవుతుంది.

మనసు కలుషితం చేసుకోకూడదు. స్నేహితులే లోకంగా అన్పించే వయస్సులో వారికి అతి ప్రాధాన్యం ఇస్తూ తల్లిదండ్రుల, ఆధ్యాపకులను నిర్లక్ష్యం చేయకూడదు. తల్లిదండ్రులు ఇచ్చే స్వేచ్ఛను దుర్వినియోగం చేస్తే భవిష్యత్ అంధకారమే.



నంద్యాల జిల్లా కళాశాలలు	సంఖ్య
ప్రభుత్వ	21
మోడల్	19
కేజీబీవీలు	27
సోషల్ వెల్ఫేర్	06
ట్రైబల్	03
బీసీ వెల్ఫేర్	03
హైస్కూల్ ప్లస్	05
ప్రైవేటు కళాశాలలు	57

చదువుకే ప్రాధాన్యం..
ఇంటర్‌లో అందరికీ తొలి ప్రాధాన్యం చదువే కావాలి. విధిగా తరగతులకు హాజరు కావడం, పాఠ్యాంశాలపై దృష్టి పెట్టడం, అధ్యాపకులిచ్చే నోట్స్‌ను ఎప్పటికప్పుడు చక్కగా రాసుకోవడం, పోటీ పరీక్షలకు అనుగుణమైన ప్రణాళిక రూపొందించుకోవడం ఎంతో ఉపయుక్తం.



సమయం.. సద్వినియోగం
ఇంటర్‌లో సెలవు రోజులు ఉంటే విద్యార్థులకు పండగే. అయితే వాటిని సద్వినియోగం చేసుకోగలిగితే విద్యార్థి ఎన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించగలరు. మనసును, శరీరాన్ని ఉల్లాసపరిచే మంచి క్రీడలు, లైబ్రరీలో పుస్తక పఠనం, స్నేహితులతో సబ్జెక్టులపై చర్చ, శ్రుతిమించని వినోదం వంటివి ఆహ్లాదంతో పాటు జీవితాన్ని ఆనందమయం చేస్తాయి.



వ్యసనాలకు దూరంగా ఉండాలి..
జీతితాన్ని ప్రభావితం చేసే ప్రమాదకరమైన వ్యసనాలు ఈ దశలో అలవాటు అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. వాటి నుంచి తప్పించుకోవాలి. సిగరెట్, గుట్కాలు, మద్యం వంటి వాటికి ఎంత దూరంగా ఉంటే అంత మేలు. సెల్‌ఫోన్ వైరస్ విద్యార్థుల ప్రగతికి అవరోధంగా మారుతుంది. అశ్లీలత వైపు మనసు మళ్లితే అంతే సంగతులు. పార్టీలు, వేడుకల పేరుతో స్నేహితులు చెడుదారుల వైపు ప్రేరేపించే అవకాశం ఉంటుంది.



స్నే'హితులు'
ఇంటర్‌లో విద్యార్థులను ప్రభావితం చేసే తొలి అంశం స్నేహం. అదృష్టం కొద్దీ అది ఉన్నత భావాలున్న వారితో కుదిరితే జీవితానికి మంచి చుక్కాని లభించినట్లే. చదువుపై ఇష్టం, పెద్దలపై గౌరవం, సమాజం మీద అవగాహన, అధ్యాపకులపై సదాభిప్రాయం ఉన్న వారితో స్నేహం చేయాలి.

లక్ష్యానికి తొలి అడుగులు..
భవిష్యత్‌లో లక్ష్యం సివిల్స్, ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర ఏ కోర్సుకైనా తొలి అడుగు పడాల్సింది ఇంటర్‌లోనే. కొత్త కొత్త స్నేహదనంతో నిండి కళాశాల జీవితం సక్రమంగా సాగితే ఒక బంగారు లోకమవుతుంది. తప్పటడుగులు వేస్తే కోలుకోలేని దెబ్బ తగులుతుంది. లక్ష్యాన్ని నిర్ణయించుకుని ముందుకు సాగాలి.

తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలి



పదవ తరగతి వరకు చదివిన వారు ఇంటర్‌కు రాగానే ఏదో తెలియని లోకంలో విహరిస్తారు. స్వేచ్ఛాజీవిగా భావిస్తారు. ముఖ్యంగా చెడు అలవాట్లకు తొందరగా దగ్గరయ్యే అవకాశం ఉంటుంది. కుటుంబ సభ్యులు గమనించి మంచి, చెడులను వివరించాలి. ఎలా చదువుతున్నాడు. ఏయే పరిసరాల్లో ఫ్రెండ్స్ ఉంటున్నారో గమనిస్తుండాలి. చెడు వ్యసనాలకు గురికాకుండా తల్లిదండ్రులు, అధ్యాపకులు శ్రద్ధ వహించాలి. – హరిఫాబాను, మానసిక వైద్యనిపుణురాలు, నంద్యాల

మితిమీరిన విశ్వాసం తగదు



పదవ తరగతి తర్వాత కొత్త ప్రపంచంలోకి అడుగు పెడతారు. కొందరు చదువును పక్కన పెట్టి ప్రేమ, సినిమాలు, షికార్లు, స్నేహం వైపు దృష్టి మరలుతుంది. దీంతో భవిష్యత్తు నాశనం అయ్యే అవకాశాలున్నాయి. తల్లిదండ్రుల పర్యవేక్షణ అవసరం. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను కనిపెడుతూ ఉండాలి. పెడదారిలో వెళ్తున్నారని అనుమానమొస్తే వారికి మంచి నడవడకను అలవర్చాలి. –రోజమ్మ, సోషల్ వర్కర్, నంద్యాల

కలలను సాకారం చేసుకోవాలి



దివంగత రాష్ట్రపతి అబ్దుల్ కలాం చెప్పినట్లు.. కలలు కనాలి. వాటిని సాకారం చేసుకోవాలి. ఇందుకు విద్యార్థులు పట్టుదలతో కృషి చేయాలి. అప్పుడే ఏదైనా సాధించుకోవచ్చు. మొదట చదవడం కష్టంగా ఉంటుంది. ఆ తర్వాత అలవాటు చేసుకుంటే పుస్తకాలతో కుస్తీ పట్టడం సులువే, తల్లి తండ్రులు ఇచ్చిన స్వేచ్ఛను దుర్వినియోగం చేస్తే భవిష్యత్తు చేజారుతుంది. – శంకర్‌నాయక్, జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖ అధికారి, నంద్యాల

రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి.రామచంద్రయ్య ధ్వజం



మాట్లాడుతున్న రామచంద్రయ్య

ఆదోని రూరల్: రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన కొనసాగుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి.రామచంద్రయ్య మండిపడ్డారు. ఆదివారం ఆదోని పట్టణంలోని రెడ్డి హాస్టల్‌లో సీపీఐ 20వ ఆదోని పట్టణ, మండల మహాసభలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా రామచంద్రయ్యతో పాటు సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మునెప్ప, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీరెడ్డి, కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి తిమ్మయ్య హాజరయ్యారు. ముందుగా స్థానిక మున్సిపల్ మైదానం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు కామ్రేడ్ మహాదేవ ఆచారి ప్రాంగణం వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన సభలో రామచంద్రయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చాయన్నారు. నమ్మి ప్రజలు ఓట్లేశాక వారిని మోసగిస్తున్నాయని మండిపడ్డారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ పేరుతో రాక్షస పాలన సాగిస్తున్నారన్నారు. దళితుల పట్ల వివక్ష పెరిగిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు లింగప్ప, అజిత్‌గౌడ్, ఏఐఎస్ఎఫ్ పట్టణ కార్యదర్శి దస్తగిరి, తదితరులు పాల్గొన్నారు.

కారు బీభత్సం

● పలువురికి గాయాలు

కర్నూలు కల్చరల్: కర్నూలు నగరంలో ఆదివారం రాత్రి ఓ కారు బీభత్సం సృష్టించింది. రాజ్‌విహార్ నుంచి సీక్యాంప్ వైపు వెళుతున్న కారు బుధవారపేట వద్ద బైక్‌పై వెళుతున్న జయచంద్ర అనే వ్యక్తిని, త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో విధులు ముగించుకొని ఇంటికి వెళుతున్న ఎస్‌ఐ ఆశలతను ఢీకొట్టింది. ప్రమాదంలో జయచంద్రకు తీవ్ర గాయాలు కాగా, ఎస్‌ఐకి కాలు విరగడంతో హుటాహుటిన ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అంతకుముందు మార్గమధ్యలో ఐదారుగురిని ఢీకొట్టింది. కర్నూలు కలెక్టరేట్‌లోని చీకటి ప్రాంతంలో కారును వదిలేశారు.



కారు నడిపిన శ్రీనివాసులును బ్రీత్ అనలైజర్‌తో పరీక్షిస్తున్న పోలీస్‌లు

కారు నడుపుతున్న వ్యక్తి న్యాయవాది శ్రీనివాసులుగా గుర్తించారు. అతన్ని బ్రీత్ అనలైజర్‌తో పరీక్షించిన పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

సిమ్ బ్లాక్ చేసి.. రూ.1.73 లక్షలు స్వాహా

దేవనకొండ: సైబర్ నేరగాళ్లు సరికొత్త మోసాలకు పాల్పడుతున్నారు. సిమ్ బ్లాక్ చేసి ఓ మహిళ బ్యాంక్ ఖాతాలో ఉన్నదంతా ఊడ్చేశారు. మండలంలోని పి.కోటకొండకు చెందిన కంచి మహేశ్వరికి గ్రామంలోనే ఏపీజీబీలో ఖాతా ఉంది. ఈ ఖాతాకు ఆమె సెల్ నంబర్ అనుసంధానం చేసి ఉండటం, అదే నంబర్‌కు ఫోన్‌పే సౌకర్యం కూడా ఉంది. ఆమె సెల్ నంబర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఈనెల 16వ తేదీన బ్లాక్ చేశారు. దీంతో ఈనెల 20వ తేదీన ఆమె కొత్త సిమ్ తీసుకోగా, ఈమె ఖాతా నుంచి రూ.1,73,001 డెబిట్ అయినట్లు మెసేజ్ వచ్చింది. స్థానిక బ్యాంకుకు వెళ్లి విచారించగా ఈనెల 17వ తేదీన రూ.లక్ష, 18వ తేదీన రూ.73 వేలు ఫోన్‌పే ద్వారా గుర్తుతెలియని వ్యక్తి అకౌంట్‌కు బదిలీ అయినట్లు ఉండటంతో ఆందోళన చెందారు. ఈ విషయంపై ఆదివారం దేవనకొండ పోలీస్‌స్టేషన్‌లో మహేశ్వరి, ఆమె భర్త గోవిందు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వంశీనాథ్ తెలిపారు.

అమ్మవారికి పల్లకీ సేవ



పల్లకీలో స్వామిఅమ్మవార్లు

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం సందర్భంగా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పల్లకీ సేవ నిర్వహించారు. ముందుగా ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉత్సవమూర్తులు ఆశీనులుగావించి వేదమంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు చేసి, మేళతాళాలతో ఆలయ ప్రదక్షిణ చేశారు. ఈ పూజా కార్యక్రమాల్లో దేవస్థాన అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

ఇద్దరు శ్రీశైల ఆలయ ఉద్యోగులపై వేటు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ఉద్యోగులపై దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు సస్పెన్షన్ వేటు వేశారు. ఆదివారం ఈ మేరకు సస్పెన్షన్ ఉత్తర్వులను జారీ చేశారు. గత నెల 27వ తేదీన దేవస్థానంలోని ఉభయ దేవాలయాల హుండీల లెక్కింపు చేపట్టారు. ఆ సమయంలో రెండు సంచులలోని నాణేలను అక్కడే మరిచిపోయారు. ఈ విషయంపై దేవస్థానం ఈఓ అంతర్గత విచారణ చేపట్టారు. ఈ విచారణలో దేవస్థానంలో క్యాషియర్‌గా విధులు నిర్వహించిన జూనియర్ అసిస్టెంట్లు శ్రీనివాసులు, మంజునాథ్ విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు నిర్ధారించి అధికారులు ఈఓకు నివేదికను సమర్పించారు. ఈ మేరకు ఇద్దరు జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగులను విధుల నుంచి తాత్కాలికంగా నిలుపుదల (సస్పెన్షన్) చేశారు. కాగా జూనియర్ అసిస్టెంట్ మంజునాథ్ ఇటీవల సాధారణ బదిలీలలో భాగంగా కాణిపాకం దేవసస్థానానికి బదిలీ అయ్యారు. సస్పెన్షన్ ఉత్తర్వులను వెంటనే అమలు చేయాలని కాణిపాక దేవస్థాన ఈఓను శ్రీశైల దేవస్థాన ఈఓ శ్రీనివాసరావు కోరారు.

ప్రైవేట్ సర్వేయర్ దారుణ హత్య

● విచారణ జరుపుతున్న గద్వాల పోలీసులు



హత్యకు గురైన ప్రైవేటు సర్వేయర్ తేజేశ్వర్ (ఫైల్)

కర్నూలు: కర్నూలు టీజే మాల్‌లో ఉన్న కెనరా బ్యాంకు మేనేజర్ తిరుమలరావు దారుణానికి ఒడిగట్టాడు. గద్వాల రాజవీధిలో ఉంటున్న ప్రైవేటు సర్వేయర్ గంట తేజేశ్వర్ (32)ను వివాహేతర సంబంధంతో హత్య చేయించినట్లు పోలీసులు భావిస్తున్నారు. తిరుమల రావు అదే బ్యాంకులో పనిచేసే కల్లూరుకు చెందిన చిరుద్యోగితో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. అలాగే కూతురుతో కూడా వివాహేతర సంబంధం కొనసాగించే ప్రయత్నం చేశాడు. అప్పటికే గద్వాలకు చెందిన తేజేశ్వర్‌తో అ యువతి ప్రేమ వివాహం చేసుకుంది. ఈ నేపథ్యంలో ప్రైవేట్ సర్వేయర్‌ను హతమార్చాలని యువతి తల్లితో కలిసి తిరుమల రావు పథకం పన్నాడు. ల్యాండ్ సర్వే చేయించాలని స్నేహితుల ద్వారా తేజేశ్వరరావును కర్నూలుకు రప్పించి రహస్య ప్రాంతంలో హత్య చేసి పాణ్యం సమీపంలోని పిన్నాపురం రస్తాలో పడేశారు. అయితే సర్వేయర్ తేజేశ్వర్ కనిపించకపోవడంతో అతని సోదరుడు తేజవర్ధన్ ఐదు రోజుల క్రితం గద్వాల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, అక్కడి పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆ జిల్లా ఎస్పీ ఆదేశాలతో ప్రత్యేక బృందం శనివారం కర్నూలుకు వచ్చి రహస్య విచారించారు. బ్యాంకు మేనేజర్ తిరుమల రావుకు సంబంధించిన స్నేహితులను అదుపులోకి తీసుకొని కర్నూలు మూడో పట్టణ పోలీసుల సహకారంతో దర్యాప్తు చేపట్టారు. మొబైల్ ఫోన్ లోకేషన్ ఆధారంగా పాణ్యం సమీపంలోని పిన్నాపురం చెరువు తేజేశ్వర్ మృతదేహం ఉన్నట్లు గుర్తించి పాణ్యం పోలీసుల సహాయంతో మృతదేహాన్ని వెలికి తీసి ఆదివారం పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ హత్యకు సంబంధించి గద్వాల పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ జరుపుతున్నారు. హత్య కుట్రకు వెనుక మరికొందరి హస్తం ఉన్నట్లు గద్వాల పోలీసులు భావించి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

గొంతు కోసి.. మృతదేహాన్ని పడేసి

పాణ్యం: తేజేశ్వర్‌ను అత్యంత కిరాతకంగా హతమార్చారని పాణ్యం ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. కారులోనే తేజేశ్వర్‌ను గొంతు కోసి హత్య చేశారని, నన్నూరు టోల్‌ప్లాజా మీదుగా పాణ్యం మండలం సుగాలిమెట్ట వద్ద పిన్నాపురం రస్తాలో పడేశారన్నారు. కారులో వచ్చిన వ్యక్తులు వివరాలు తెలుసుకునేందుకు విచారణ ప్రారంభించినట్లు తెలిపారు. కారు కోసం గద్వాల్ పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గాలిస్తున్నట్లు ఆయన తెలిపారు. కాగా.. పోలీసుల అదుపులో ముగ్గురు వ్యక్తులు ఉండగా మరో కీలక వ్యక్తి పరారీలో ఉన్నట్లు సమాచారం.

పార్టీ కోసం పనిచేసే వారికి గుర్తింపు



వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డిని సన్మానిస్తున్న మంజులత

కర్నూలు (టౌన్): పార్టీ కోసం పనిచేసే వారికి ప్రత్యేక గుర్తింపు ఉంటుందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి స్పష్టం చేశారు. ఇటీవల వైఎస్సార్‌సీపీ అంగన్‌వాడీ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన రెడ్డి మంజులత ఆదివారం స్థానిక గిప్సన్ కాలనీలో పార్టీ జిల్లా అధ్యక్షుడిని కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్తు వైఎస్సార్‌సీపీదేనని, ఏడాదిలోపే కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. మహిళలు సైతం మోసపోయామన్న భావనకు వచ్చారన్నారు. అన్ని వర్గాలకు ఆశలు కల్పించి నిరాశకు గురిచేసిన చంద్రబాబు సర్కారుకు గుణపాఠం తప్పదన్నారు. ప్రస్తుతం ప్రజలు జగనన్న పాలనను గుర్తుకు తెచ్చుకుంటున్నారన్నారు. ప్రతి సంక్షేమ పథకాన్ని ఇంటికి చేర్చిన ఘనత ఆయనదని చెప్పారు. ఇప్పుడు చంద్రబాబు సర్కారు అలా చేయకపోగా ప్రశ్నించే తమ పార్టీ నాయకులు, కార్యకర్తలపై కేసులు నమోదు చేసి ఇబ్బందులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యకర్తలు రెట్టించిన ఉత్సాహంతో ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటం చేయాలని, హామీల అమలుకు ప్రభుత్వ మెడలు వంచుదామని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ఎస్వీ యూత్ పాల్గొన్నారు.

లోక కల్యాణార్థం నేడు పంచమఠాల్లో పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో లోకకల్యాణం కోసం ప్రతి సోమవారం ఉదయం 7గంటలకు పంచమఠాల్లోని దేవతామూర్తులకు విశేషపూజలు నిర్వహించనున్నట్లు దేవస్థాన ఈఓ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. శ్రీశైలంలో కొన్ని మఠాలు కాలగర్భంలో కలిసిపోగా, ప్రస్తుతం ఆలయానికి దగ్గరలో వాయువ్య భాగాన ఘంటామఠం, భీమశంకరమఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠం, సారంగధరమఠం అనేవి పంచమఠాలనే పేర్లతో పిలవబడుతున్నాయి. ఈ మఠాల్లోని దేవతామూర్తులకు సోమవారం నిత్య దూప నివేదన కైంకర్యాలు జరిపిస్తున్నారు. భక్తులు ఈ పూజాదికాలను దర్శించి తరించవలసినదిగా ఈఓ ఆదివారం ఓ ప్రకటనలో కోరారు.

యువగళం పేరుతో మోసం

● డీవైఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేష్

ఆదోని రూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు యువగళం పేరుతో నారా లోకేష్ పాదయాత్ర నిర్వహించి యువకులను మోసం చేశారని డీవైఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేష్ విమర్శించారు. అధికారంలోకి వచ్చి ఏడాది అయినప్పటికీ యువతకు ఎలాంటి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించలేదన్నారు. ఆదోని పట్టణంలో డీవైఎఫ్‌ఐ జనరల్ బాడీ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదోని నియోజకవర్గంలో పత్తి ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయడంలో పాలకులు శ్రద్ధ చూపడం లేదన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఆదోనిలో కొత్త పరిశ్రమలు స్థాపించి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. సమావేశంలో డీవైఎఫ్‌ఐ ఆదోని పట్టణ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఇందులో డీవైఎఫ్‌ఐ ఆదోని పట్టణ అధ్యక్ష, కార్యదర్శులుగా మోహన్, వెంకటేష్, సహాయ కార్యదర్శులుగా సతీష్, నాగరాజు, నవీన్, ఉపాధ్యక్షులుగా వీరేష్, వినోద్, సూరితో పాటు మరో 13 మందిని కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వృద్ధుడు మృతి

చిప్పగిరి: నేమకల్లు రైల్వే స్టేషన్ సమీపంలో ఆదివారం రైలు ఢీకొని గుర్తు తెలియని వృద్ధుడు దుర్మరణం చెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మొలగవల్లి – నేమకల్లు స్టేషన్ల మధ్యలో పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి నడుచుకుంటూ వెళ్తుండగా కర్ణాటక ఎక్స్‌ప్రెస్ ఢీకొనడంతో మృతి చెందాడు. మృతదేహం గుర్తు పట్టలేనంతగా నుజ్జునుజ్జు అయ్యింది. మృతుడు నీలం రంగు చొక్క, నీలం రంగు జీన్స్ ప్యాంట్ వేసుకున్నాడని, సుమారు 65 సంవత్సరాలు ఉంటుందని గుంతకల్లు రైల్వే ఎస్‌ఐ కే గోపాల్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, ఆచూకీ గుర్తించిన వారు 9849157634కు సమాచారం అందించాలన్నారు.

గుర్తుకొస్తున్నాయ్..



గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

● 30 ఏళ్ల తర్వాత కలుసుకున్న తెర్నేకల్ జెడ్పీ పాఠశాల విద్యార్థులు

ఆలూరు రూరల్: చిన్నప్పుడు ప్రభుత్వ పాఠశాల అందించిన అనుభవాలను వారు గుర్తు చేస్తున్నారు. అప్పటి చదువులపై ముచ్చటించుకున్నారు. బాల్యం జ్ఞాపకాల్లో మునిగి తేలారు. దేవనకొండ మండలం తెర్నేకల్ గ్రామ జెడ్పీ హైస్కూల్‌లో 1994–95 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు 30 ఏళ్ల తర్వాత ఆదివారం ఆత్మీయంగా కలుసుకున్నారు. అప్పట్లో చదువు చెప్పిన గురువులు హరిచంద్రా రెడ్డి, రంగస్వామి, గంగాధర్‌ను ఆత్మీయంగా సన్మానించారు. వారు బోధించిన పాఠాలు, క్రమశిక్షణతోనే ఉన్నత శిఖరాలకు చేరామని చెబుతూ పాదాభివందనం చేశారు. పూర్వ విద్యార్థులు రాఘవేంద్ర రెడ్డి, వెంకటేశ్వర్లు, రామచంద్ర తదితర 20 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



ఆనాటి జ్ఞాపకాలు ఎంతో రుచి..